క్లుప్తంగా

వైభవంగా శివాలయ శిఖర పూజ



పూజలు చేస్తున్న భక్తులు

బేల: మండలంలోని సాంగిడి గ్రామ శివారులో స్థానికుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయ శిఖర పూజను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువు మోతిజీ మహరాజ్ ఆలయం నుంచి స్థానిక ప్రధాన వీధుల గుండా భాజభజంత్రీలు, మహిళల మంగళ హారతులతో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శిఖర పూజ నిర్వహించారు. కార్యక్రమంలో శివాలయ కమిటీ సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న సభ్యులు

గుడిహత్నూర్: ఇటీవల వెలువడిన గ్రూప్–1 ఫలితాల్లో ప్రతిభ కనబరిచి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైన గుడిహత్నూర్ ఎస్సై కె.మహేందర్‌ను స్థానిక రత్న సాన్వి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సోమవారం సన్మానించారు. సామాన్య కుటుంబంలో జన్మించి తను డీఎస్పీగా ఉన్నత ఉద్యోగం సాధించి నేటి యువతకు ఆయన స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. సొసైటీ వ్యవస్థాపకుడు ఉపారపు సత్యరాజ్, అమరేశ్వర్, సతీష్, రాజహుల్, గణేష్, అశోక్, ఓంకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోండి

ఇచ్చోడ: రాజీవ్ యువవికాసం పథకానికి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారి హార్డ్ కాపీని దరఖాస్తు ఫాంతో పాటు మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏప్రిల్ 5 లోపు అందచేయాలని కోరారు. దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవద్దన్నారు.

సామూహిక లింగాష్టక పారాయణం



లింగాష్టక పారాయణంలో పాల్గొన్న భక్తులు

బోథ్: సొనాల మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర మందిరంలో సోమవారం సామూహిక లింగాష్టక పారాయణం నిర్వహించారు. ప్రతీ సోమవారం ఆలయంలో లింగాష్టక పారాయణం నిర్వహిస్తామని శివాలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొత్తం 21 వారాల పాటు కొనసాగుతుందన్నారు. గ్రామానికి చెందిన రామాయి రాము అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెల్లకల్లు దుకాణాలపై పోలీసుల దాడులు

ఆదిలాబాద్‌రూరల్: అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఆదిలాబాద్ రూరల్, మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు తెల్లకల్లు దుకాణాలపై పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ రూరల్, మావల పోలీసులు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో అనుమతులు లేకుండా కొనసాగుతున్న తెల్లకల్లు దుకాణాలపై దాడి చేయడం జరిగిందన్నారు. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బట్టి సావర్‌గాంలో ఎలాంటి అనుమతులు లేకుండా తెల్లకల్లు దుకాణం నిర్వహిస్తున్న నాగరాజుగౌడ్‌పై మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అలాగే ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాపల్‌గూడ వీడీసీ కమిటీకి డబ్బులు చెల్లించి ప్రభుత్వ అనుమతి, లైసెన్స్ లేకుండా కల్లు దుకాణం నిర్వహిస్తున్న దినేష్ గౌడ్, వీడీసీపై కేసు నమోదు చేశారు. తంతోలి, బంగారిగూడ, బృందావన్ కాలనీ, చిట్యాల్‌బోరి గ్రామాల్లో అనుమతులు లేకుండా తెల్లకల్లు దుకాణం నిర్వహిస్తున్న వారిపై సైతం చర్యలు తీసుకున్నామన్నారు. నాలుగు కేసులను ఎక్సైజ్ శాఖకు అప్పగించడం జరిగిందన్నారు. ఆయా గ్రామాలభివృద్ధి కమిటీలు అనుమతులు లేకుండా తెల్లకల్లు దుకాణాలు కొనసాగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై జిల్లా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో సీఐ ఫణిధర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్



తలమడుగు: ఉండం గ్రామంలో..



తాంసి: ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



నేరడిగొండ: శుభాకాంక్షలు తెలుపుతున్న గజేందర్



ఉట్నూర్‌రూరల్: రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఆత్రం సుగుణ



ఇచ్చోడ: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జిల్లా వ్యాప్తంగా రంజాన్ పండుగను సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఈద్గాల వద్ద, మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంతో కేస్లాగూడలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, నేరడిగొండలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. – సాక్షి, నెట్‌వర్క్



సిరికొండ: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బేల: ఈద్ ముబారక్ తెలుపుతున్న నాయకులు



బోథ్: శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సై



బజార్‌హత్నూర్‌లో..



ఇంద్రవెల్లి: ఈద్ ముబారక్ తెలుపుతున్న ఎమ్మెల్యే

ఆలయ అభివృద్ధికి ప్రణాళిక



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: జిల్లాలో అతిపురాతన ఆలయంలో ఒక్కటైన సిరిచెల్మ మల్లికార్జున ఆలయ అభివృద్ధికి రూ. 5 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. సోమవారం దేవాదాయశాఖ అధికారులతో కలిసి మల్లికార్జున ఆలయాన్ని సందర్శించారు. ఆలయాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేస్తామన్నారు. ఇచ్చోడ మండల కేంద్రం నుంచి సిరిచెల్మ వరకు రూ. 40 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం, సిరిచెల్మ మీదుగా నిర్మల్ జిల్లా పెంబి వరకు రోడ్డు నిర్మాణం కోసం అటవీశాఖ నుంచి అనుమతులు తీసుకుంటామన్నారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన మినీ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ 8వ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో నిత్యం పూజలు చేయడం వలన కుటుంబాల్లో సుఖశాంతులు నెలకొంటాయన్నారు.

వక్ఫ్‌బోర్డ్ బిల్లు రద్దు చేయాలి



ఉట్నూర్‌రూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న మైనార్టీలు

తలమడుగు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డ్ బిల్లు వెంటనే రద్దు చేయాలని ముస్లిం మతపెద్దలు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలో దేవపూర్ గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా చేతులకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా మత పెద్ద మౌలానా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వక్ఫ్‌బోర్డ్ బిల్లు తీసుకురావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వక్ఫ్‌బోర్డ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఉట్నూర్ మండలంలోని ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు సోమవారం మైనార్టీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఈద్గా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ భూములను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడానికి కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ జామమసీద్ మౌలానా కలీం, మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంతో పాటుగా మాదపూర్‌లో సోమవారం రంజాన్ సందర్భంగా ఈద్గాల వద్ద ముస్లింలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. చేతులకు నల్లబ్యాడ్జీలు కట్టుకొని నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డ్‌ను నియంత్రించే చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. గతంలో ఉన్న చట్టాలనే కొనసాగించాలని మైనార్టీలు డిమాండ్‌చేశారు.



తలమడుగు: నిరసన తెలుపుతున్న ముస్లింలు



ఇచ్చోడ: మాదపూర్ ఈద్గా వద్ద..

'దుండగులను అరెస్టు చేయాలి'

ఆదిలాబాద్‌రూరల్: ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నాగోబా ఆలయం సమీపంలో ఈనెల 27న గోండి ధర్మ గురు హీరాసుక లింగో జెండా, స్థూపాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్‌లు డిమాండ్ చేశారు. సోమవారం మావల మండలంలోని బట్టి సావర్‌గాం శివారు ప్రాంతంలో గల కుమురం భీం గూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హీరాసుక జెండా, స్థూపాన్ని ధ్వంసం చేసి ఆదివాసీ తెగలలో చిచ్చు పెట్టే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించారు. దుండగులను అరెస్టు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. ఆదివాసీ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సలాం వరుణ్, తుడుందెబ్బ మావల మండల అధ్యక్షుడు వెడ్మ ముకుంద్, ఆత్రం భుజంగ్‌రావ్, తులసీరాం, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న నాయకులు

విద్యానగర్‌లో తాగునీటి కష్టాలు



తాంసి మండల కేంద్రంలోని విద్యానగర్ కాలనీ ప్రజలు తాగునీటికి కష్టాలు పడుతున్నారు. రెండు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. దగ్గరలో ఉన్న సాయిబాబా ఆలయం బోర్ మోటార్ వద్దకు వెళ్లి తాగునీటి బిందెలతో తీసుకెళ్తున్నారు. అధికారులు స్పందించి భగీరథ నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. – తాంసి

రోడ్డుకు ఇరువైపులా మొక్కలు..!

- పొన్నారి నుంచి సుంకిడి వరకు..
- 2400 మొక్కలు ఏర్పాటు
- అటవీశాఖ ఆధ్వర్యంలో సంరక్షణ

తాంసి: పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనానికి ప్రాధాన్యం ఇస్తూ మొక్కల పెంపకాన్ని చేపట్టేలా ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుంది. ప్రతీ ఏటా హరితహారం కార్యక్రమంలో భాగంగా విరివిగా మొక్కలను నాటుతున్నారు. ఇప్పటికే అటవీశాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. అటవీ ప్రాంతంతో పాటు రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటుతున్నారు. ప్రస్తుతం జిల్లా కేంద్రం నుంచి తలమడుగు, తాంసి మండలాల్లోని ఆయా గ్రామాల మీదుగా మహారాష్ట్ర వెళ్లే అంతర్రాష్ట్ర రోడ్డు వెంట ఇరువైపులా నాటిన వివిధ మొక్కలు సరిగ్గా ఎదుగలేదు. మళ్లీ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు అటవీ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం కూలీల సాయంతో మొక్కలను నాటడం పూర్తి చేశారు. అలాగే పశువుల భారీ నుంచి కాపాడేందుకు కంచె ఏర్పాటు చేశారు.

10 కిలోమీటర్లు.. 2400 మొక్కలు..

తాంసి మండలంలోని పొన్నారి శివారులో ఉన్న అంతర్రాష్ట్ర రోడ్డు నుంచి తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామం వరకు దాదాపుగా 10 కిలోమీటర్ల మేర మొక్కలను నాటనున్నారు. పొన్నారి నుంచి ఖోడద్, హస్నాపూర్, వడ్డాడితో పాటు ఉండమ్ గ్రామాల మీదుగా సుంకిడి వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారి ఇరువైపులా మొక్కలు పెంచనున్నారు. ప్రత్యేకంగా ములుగు జిల్లా నుంచి ఆరు ఫీట్ల పొడవున్న 2400 మొక్కలు తీసుకువచ్చారు. రావి, మహగనితో పాటు ఫైకస్ రకానికి చెందిన మొక్కలు తీసుకువచ్చారు. ఇప్పటికే మొక్కలు నాటి నీటిని అందిస్తున్నారు. అటవీశాఖ సిబ్బంది దగ్గరుండి మొక్కల సంరక్షణను పర్యవేక్షిస్తున్నారు.

వాచర్‌ల నియామకం..

నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేకంగా అటవీశాఖ ఆధ్వర్యంలో వాచర్‌లను ఏర్పాటు చేశారు. నిరంతరం పర్యవేక్షణ చేయడంతో పాటు నీరు అందించేందుకు ముగ్గురు వాచర్‌లను నియమించారు. మొక్కల దగ్గర పిచ్చిమొక్కలు పెరుగకుండా, పశువులు ధ్వంసం చేయకుండా వాచర్‌లు మొక్కలను పర్యవేక్షణ చేయనున్నారు. రెండు ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నారు.



రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు

మొక్కల సంరక్షణకు చర్యలు



అంతర్రాష్ట్ర రోడ్డు వెంట ఇరువైపులా అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ రకాల మొక్కలు నాటుతున్నాం. మొక్కలను నాటడం పూర్తి చేశాం. నాటిన మొక్కలు ఏపుగా పెరిగే విధంగా సంరక్షణ చేపడుతున్నాం. ప్రస్తుతం వేసవి సీజన్ కావడంతో ట్యాంకర్‌ల ద్వారా ఉదయం, సాయంత్రం మొక్కలకు నీటిని అందిస్తున్నాం.

– సాయికుమార్, అటవీశాఖ బీట్ అధికారి

నకిలీ విత్తన దందా

- జిల్లాలో గుట్టుగా విక్రయాలు
- అమాయక రైతులే టార్గెట్
- పట్టించుకోని అధికారులు

ఇచ్చోడ: జిల్లాలో నకిలీ విత్తనాల దందా గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతుంది. ప్రతీ ఏటా మార్చి, ఏప్రిల్ నెలలో కొంత మంది వ్యాపారులు తక్కువ ధరల పేరుతో అమాయక రైతులకు అంటకట్టి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

ఏజెన్సీ మండలాలే టార్గెట్..

నకిలీ విత్తన వ్యాపారులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎక్కువగా ఏజెన్సీ మండలాలనే టార్గెట్ చేస్తున్నారు. తక్కువ ధరలతో ఎక్కువ దిగుబడుల ఆశచూపి గిరిజన రైతులకు అంటగడుతున్నారు. ఒక్క పత్తి విత్తన బ్యాగ్‌ను రూ. 5 వందల నుంచి రూ. 650 వరకు విక్రయిస్తు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. గత పదేళ్లుగా జిల్లాలో ఇదే తంతు కొనసాగుతోంది.

తూర్పు జిల్లా నుంచి దిగుమతి..

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూర్, కర్నూల్, నంద్యాల, గుజరాత్‌తో పాటు హైదరాబాద్ లాంటి పట్టణాల నుంచి నకిలీ పత్తి విత్తనాలను బెల్లంపెల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్‌లాంటి పట్టణలకు రైలు మార్గాల ద్వారా దిగుమతి చేసుకొని అక్కడి నుంచి ఆదిలాబాద్ జిల్లాలో విక్రయిస్తున్నారు.

ముందస్తు చర్యలు శూన్యం

గత కొన్నేళ్ల నుంచి నకిలీ విత్తనాల అరికట్టేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. జూన్ నెలలో విజిలెన్స్ అధికారులు విత్తనాల దుకాణాలను తనిఖీలు చేస్తూ.. హడవిడి చేస్తూ.. చేతులు దులుపుకుంటున్నారు. కానీ మార్చి, ఏప్రిల్, మే నెలలో నకిలీ విత్తనాలను వ్యాపారులు దొడ్డిదారుల్లో దిగుమతి చేసుకొని వానాకాలం సాగుకు ముందే రైతులకు విక్రయిస్తున్నారు.



పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు (ఫైల్)

- గతేడాది ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో దస్నాపూర్ ప్రాంతంలో ప్రైవేట్ గోదాంలో రూ 19.50 లక్షల విలువగల నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు తయారు చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. కర్నాటక నుంచి పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకున్న లూజ్ విత్తనాలను బ్రాండెడ్ కంపెనీల పేరిట ప్యాకింగ్ చేస్తూ పట్టుబడ్డారు.
- గత నెల 23న మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని వడాలలో రూ.50 వేల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు.
- గత నెల 27న మంచిర్యాల జిల్లా దేవాపూర్‌లో రూ.7 లక్షల 87 వేల విలువైన నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. మంచిర్యాల జిల్లాలో నెల రోజుల నుంచి దాదాపుగా రూ.50 లక్షల విలువ చేసే నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఘన్‌పూర్, బోరజ్, లక్ష్మీపూర్, బేల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరంగా తనిఖీలు నిర్వహించే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. తనిఖీల్లో పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్ స్వామి, జిల్లా వ్యవసాయాధికారి

ఆర్థికసాయం

కడెం: మండలంలోని బాబానాయక్‌తండా పంచాయతీ పరిధి గంగన్నపేట్‌కు చెందిన కోవ కౌసల్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఈమె భర్త తన ఇద్దరు చిన్నారులతో కలిసి సోమవారం ఉట్నూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను కలిశారు. స్పందించిన ఎమ్మెల్యే మానవత దృక్పథంతో «వెడ్మ ఫౌండేషన్»ద్వారా రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు.



ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే